# ప్రజా మారిటిలి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా - టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్


ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 16 | బుధవారం 09 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై

# సస్పెన్షన్ వేటు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్



**హైదరాబాద్ :**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో - మిగతా 2 లో

## 'అన్నది నా తల్లిని నీ తల్లిని కాదు'



- హరీశ్‌రావుపై స్పీకర్ ప్రసాద్ కుమార్ ఫైర్
- హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- ఆవేశం తనకు ఉండాలని స్పీకర్ భావోద్వేగం
- మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారంటూ ఆవేదన

**హైదరాబాద్ :**
మాజీ మంత్రి హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లిపై చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. - మిగతా 2 లో




2 లో

## తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

- సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నోటిఫికేషన్
- ఇప్పటివరకు 2.88 లక్షల మంది దరఖాస్తు ప్రక్రియ పూర్తి
- చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు రావొచ్చని బోర్డు సూచన


## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం

**ఢిల్లీ :**
భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని - మిగతా 2 లో



## మోదీ వేదిక వద్ద తుపాకీ కలకలం



- ఇద్దరు నిందితులు అరెస్టు
- మోదీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం
- ప్రధాని పాల్గొనే వేదిక వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు ఉన్న వ్యక్తి, సాయుధుడు అరెస్టు
- దర్యాప్తు చేపట్టిన ముంబయి క్రైమ్ బ్రాంచ్ అధికారులు

**ఢిల్లీ :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం జరిగింది. మోదీ పాల్గొనే కార్యక్రమం వేదిక వద్ద అనుమానస్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, ఒక తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో ప్రధాని రాకకు ముందే ముంబయిలో హై అలర్ట్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం - మిగతా 2 లో

## ఐరాస కొత్త మ్యాప్‌లో ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

- అరుణాచల్ కు నాగాలాండ్‌తో సరిహద్దులు మ్యాప్ నుంచి తొలగింపు
- అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా
- ఈ మార్పులకు కారణాన్ని వివరించని ఐరాస
- జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని చుక్కల రేఖతో గుర్తింపు
- అరుణాచల్, ఆక్సాయ్‌చిన్ భారత్‌లో అంతర్భాగమేనని న్యూఢిల్లీ స్పష్టీకరణ

2 లో

## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

- సౌత్‌లో ఎక్కడ ఎలా ఏపీ, తెలంగాణపై ఐఎండీ లేటెస్ట్ అప్డేట్
- సెప్టెంబర్‌లో దక్షిణ ద్వీపకల్పంలో వర్షాల పరిస్థితి బలహీనంగానే ఉండే అవకాశం
- ఏపీలో 45 శాతం, కేరళలో 24 శాతం వర్షపాతం లోటు
- తెలంగాణలో 8 నుంచి 10 వరకు అక్కడక్కడా వర్షాలు



**హైదరాబాద్ :**
సెప్టెంబర్ నెలలో వర్షాలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాల తీవ్రత తక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో ఇప్పటికే వర్షపాత లోటు కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల ప్రకారం దక్షిణ ద్వీపకల్పంలో రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితి ప్రాంతాల వారీగా మారనుంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే 45 శాతం తక్కువ వర్షం నమోదైంది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అధిక వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో - మిగతా 2 లో

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే



- మంత్రి నాదెండ్ల మనోహర్
- సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- కిలో ఉల్లిపాయలు రాయితీపై రూ.32కే అందించాలని నిర్ణయం
- వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు
- చౌకడిపోల్లో కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. - మిగతా 2 లో



## లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- మాజీ ఎంపీ మార్గాని భరత్
- డీఎస్సీలో అక్రమాలు జరిగాయన్న మార్గాని భరత్
- సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్
- లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే తాను ఎంపీగా గెలిచానని వ్యాఖ్య

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా - మిగతా 2 లో

## ప్రతి నియోజకవర్గానికి రూ.కోటి నిధులు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి రూ. కోటి చొప్పున నిధులు
- టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు కీలక సూచనలు
- పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై నేతలకు దిశానిర్దేశం
- ప్రభుత్వంపై సానుకూలతను ఓట్లుగా మారేలా పనిచేయాలన్న సీఎం
- పార్టీ బలోపేతమే లక్ష్యం.. నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం
- పార్టీ-ప్రభుత్వ సమన్వయంతో ముందుకు సాగా




**అమరావతి :**
నియోజకవర్గాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలతను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లుగా మార్చేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా నేతలు పని చేయాలని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో 2024 కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పార్టీ బలోపేతం, నియోజకవర్గాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. పదేళ్లకోసారి మారుతున్న జనరేషన్, మారుతున్న ప్రజల ఆలోచనలకు తగ్గట్టుగా రాజకీయ నాయకత్వమూ అప్‌డేట్ కావాలని పిలుపునిచ్చారు. డబ్బు కాదు ప్రజలతో బంధం, కేడర్‌తో అనుబంధం, సమస్యల పరిష్కారంలో పట్టుదలే రాజకీయ - మిగతా 2 లో

# సంపాదకీయం

## అది యుద్ధం కాదట!

ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్నది యుద్ధం కాదట. కనుక, అది ఎప్పుడు ముగుస్తుందో, ఎలా ముగుస్తుందో చెప్పలేమన్నది అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య సారాంశం. ఏడు నెలలుగా యుద్ధం సాగుతూ, నవంబరులో ఎన్నికలొస్తున్న తరుణంలో జనానికి ఏం చెప్పుకోవాలో తెలియక ట్రంప్ ప్రభుత్వం ఇలా కొత్త నిర్వచనాలు సృష్టిస్తున్నట్టుంది. ఓ నెలపాటు కాస్తోకూస్తో ప్రశాంతత కొనసాగిన తరువాత అమెరికా మళ్ళీ ఇటీవల ప్రళయభీకరంగా ఇరాన్ మీద విరుచుకుపడిన నేపథ్యంలో గురువారం జేడీ వాన్స్ ఈ వ్యాఖ్య చేశారు. ఇరాన్‌తో చర్చలు నిలిచిపోవడం, తిరిగి రాజుకున్న యుద్ధంతో అమెరికాలో డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం ట్రంప్ రేటింగ్‌లను కుప్పకూలుస్తూ, మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేస్తున్నాయి.మూడు రోజులనాటి అమెరికా దాడులు వాన్స్ పరిభాషలో యుద్ధం కాకపోవచ్చు గానీ, కాస్తంత అదుపులో ఉన్న చమురు ధరలు ఈ దెబ్బతో తిరిగి భగ్గుమన్నాయి. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్‌లో ఒక పెళ్ళి బృందం మీద అమెరికా విమానాలు జరిపిన దాడిలో అరడజను మంది మరణించారు, ఎనభై మంది తీవ్రంగా గాయపడ్డారు. అప్రదిష్టపాలైన అమెరికా ఈ దాడిమీద దర్యాప్తు జరుపుతుందట. ఈ దారుణఘటన సహా అమెరికా రెండురోజులపాటు 60పైగా స్థావరాలపై జరిపిన దాడులకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని దాని మిత్రదేశాలపై ఇరాన్ కూడా విరుచుకుపడింది. శత్రువును ఎంతగా దెబ్బతీశామో ఉభయపక్షాలూ ఎంతో గొప్పగా లెక్కలు విప్పుకున్నాయి కానీ, పశ్చిమాసియా మళ్ళీ ఉద్రిక్తంగా తయారైంది. 'హోర్ముజ్' పూర్తిగా తన నియంత్రణలోనే ఉందనీ, దాని పేరు 'ట్రంప్ జలసంధి'గా మార్చేయాలని అమెరికా అధ్యక్షుడు గొప్పకు పోతున్నారు. హోర్ముజ్‌లో సముద్రంలోని మందుపాతరలను తాకి చమురు ట్యాంకర్లు పేలిపోతున్న వార్తలు కూడా మరోపక్క వింటున్నాం. అమెరికా దాడులు కచ్చితంగా ఒక భయానకమైన, పూర్తిస్థాయి యుద్ధానికి మార్గం సుగమం చేస్తున్నాయి. హోర్ముజ్‌మీద పట్టు, చమురు ధరల నియంత్రణతో గ్లోబల్ మార్కెట్లలో విశ్వాసాన్ని నెలకొల్పడంతోపాటు, అమెరికా ఓటరు మనసు గెలుచుకోవాలని ట్రంప్ ఆశపడుతున్నారు. దీనికి బదులుగా హోర్ముజ్ చేజారలేదని నిరూపిస్తూ మిగతా ప్రపంచంలో అభద్రత, అనుమానాలు కొనసాగేట్టు చేయడం ఇరాన్ లక్ష్యం. ఇరాన్ తన అణ్వాయుధాలను వదిలేసి, యురేనియం శుద్ధిని నిలిపేసి, పశ్చిమాసియాలోని తన ప్రాక్సీలకు ఆయుధాలు అందించడం ఆపేసి, పూర్తిగా చేతులు ఎత్తేసేంతవరకూ యుద్ధం సాగుతూనే ఉంటుందని అమెరికా విదేశాంగమంత్రి చెబుతున్నారు. అణ్వాయుధాలూ లేవు, నిల్వలూ లేవు, మీకు ఓపికున్నంత కాలం చేతనైనది చేసుకోమని ఇరాన్ సవాల్ చేస్తోంది.సముద్రంలో తొమ్మిది నెలలపాటు ఉండిపోయి, తుప్పుపట్టి, తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న ఐదువేలమంది సైనికులతో అమెరికా యుద్ధనౌక అబ్రహాం లింకన్ మొన్ననే థాయ్‌లాండ్ తీరం చేరింది. అమెరికన్ సైనికులు సేదతీరడానికి వస్తుండటంతో పటాయాలో వ్యభిచార నియంత్రణ చర్యలు చేపట్టినట్టుగా వార్తలు వెలువడ్డాయి. తాజాగా, పశ్చిమాసియాలో దళాల మోహరింపు వచ్చే ఏడాదివరకూ పొడిగిస్తూ అమెరికా రక్షణమంత్రి ఆదేశాలు జారీ చేసినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. యుద్ధం ఆరంభించిన అమెరికా అధ్యక్షుడికి దానిని ఇప్పట్లో ముగించే ఉద్దేశం లేదని అర్థమవుతూనే ఉంది. యాభైవేల మంది అమెరికన్ సైనికులు, పాతిక యుద్ధనౌకలు, డజన్లకొద్దీ యుద్ధవిమానాల మోహరింపుతో ట్రంప్ ఇప్పటివరకూ సాధించిందేమిటో తెలియదు. ఫిబ్రవరిలో ఆరంభమైన 'ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీ' ట్రంప్ పరిభాషలో చెప్పాలంటే, ఒక స్వల్పకాలిక సైనిక చర్యగా కాక, ఇరాన్ తీవ్రప్రతిఘటనతో యుద్ధంగా మారి ఏడు నెలలుగా సాగుతోంది. అమెరికన్లకూ, మిగతా ప్రపంచానికీ తీవ్రనష్టాన్ని చేకూర్చిన అమెరికా అధ్యక్షుడు వచ్చే ఏడాది కూడా యుద్ధాన్ని కొనసాగించే ఆలోచనతో ఉన్నారన్నది వాన్స్ వ్యాఖ్యల్లోని పరమార్థం.

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

**మొదటిపేజీ తరువాయి -** ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు.వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

## లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి -** లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. "లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి" అని బహిరంగ సవాల్ విసిరారు.

## మోదీ వేదిక వద్ద తుపాకీ కలకలం

**మొదటిపేజీ తరువాయి -** ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్(బీకేసీ) ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. అయితే, వేదిక వద్ద ప్రధాన మంత్రి కార్యాలయానికి చెందిన అధికారిగా చెప్పుకుంటూ తిరుగుతున్న వ్యక్తులు బీకేసీలోని నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోకి ప్రవేశించారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది వారిద్దరి అనుమానాస్పద ప్రవర్తనను గమనించి అడ్డుకున్నారు. వారివద్ద ఉన్న ఐడీ కార్డులను తనిఖీ చేసి నకిలీవని గుర్తించారు. అనంతరం వారిద్దరిని ముంబయి పోలీసులకు అప్పగించారు.ఇదిలా ఉండగా, ముంబయిలో బీకేసీలో ఉన్న ఒక షాపింగ్ మాల్‌లోకి తుపాకీతో ప్రవేశించడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అయితే, ఆ ప్రాంతంలో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి ఈ ఘటనకు ఎటువంటి సంబంధం లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఆ ఘటన సోమవారమే బీకేసీలోని 'జియో వరల్డ్ ప్లాజా'లో జరిగిందని, దీనికి ప్రధాని కార్యక్రమంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు



**మొదటిపేజీ తరువాయి -** గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు.మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

**మొదటిపేజీ తరువాయి -** ఏపీ కూడా ఉంది. రానున్న రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. అయితే వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 ప్రాంతంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్--దక్షిణ ఒడిశా తీరాల సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాల అవకాశాలు క్రమంగా పెరగనున్నాయి. ఐఎండీ తాజా బులెటిన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత 12 నుంచి 14 వరకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంటే తెలంగాణలో వెంటనే భారీ వర్షాల పరిస్థితి కాకుండా, రానున్న రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది.దక్షిణాదిలో మరో ముఖ్యమైన మార్పు తమిళనాడులో కనిపించనుంది. సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. రాయలసీమలో కూడా సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు చెదురుమదురు నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.కేరళలో జూన్ నుంచి సెప్టెంబర్ 7 వరకు 24 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాబోయే రోజుల్లో మాత్రం కేరళ, మాహే ప్రాంతాల్లో కొన్ని దశల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 8, 9 తేదీలతో పాటు 13, 14 తేదీల్లోనూ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అయితే కేరళలో కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలో వాతావరణం ప్రాంతాల వారీగా మారే అవకాశం ఉంది.ఉత్తర కర్ణాటకలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో సెప్టెంబర్ 10, 11 తేదీల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. సెప్టెంబర్ 12 నుంచి 14 మధ్య దక్షిణ కర్ణాటకలోనూ వర్షాల విస్తృతి పెరగొచ్చని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని వాతావరణ పరిస్థితులు ఒకే విధంగా లేవు.ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం ఉండగా, దక్షిణ ద్వీపకల్పంలో మాత్రం వర్షాలు ప్రాంతాల వారీగా మారుతున్నాయి. అందుకే వర్షపాతం లోటు ఉన్న రాష్ట్రాల్లో ఒక్కసారిగా భారీ వర్షాలు కురిసినా మొత్తం లోటు వెంటనే పూడిపోదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 45 శాతం లోటు ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో రాబోయే రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం ఉన్నా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో వర్షాలు పడతాయని చెప్పలేం.ప్రస్తుతం దక్షిణాది వాతావరణంలో అత్యంత ఆసక్తికరమైన పరిణామం సెప్టెంబర్ 11 ప్రాంతంలో బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉన్న అల్పపీడనం. ఇది ఏ దిశగా కదులుతుంది ఎంత బలపడుతుంది దాని ప్రభావం ఏపీ, ఒడిశా, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలపై ఎంతవరకు ఉంటుంది అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. అందువల్ల దక్షిణాది ప్రజలు కేవలం భారీ వర్షాల హెచ్చరికలనే కాకుండా, స్థానిక వాతావరణ శాఖ విడుదల చేసే రోజువారీ సూచనలను కూడా గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఐరాస కొత్త మ్యాప్‌లో ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

**మొదటిపేజీ తరువాయి -**

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే.ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అస్సాం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు.అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు.జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్‌ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది.ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది.ఆఫ్రికన్ గ్రూప్ తరపున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది.ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

## ప్రతి నియోజకవర్గానికి రూ.కోటి నిధులు




**మొదటిపేజీ తరువాయి -** విజయానికి అసలైన బలమని అన్నారు. పార్టీ కేడర్‌ను ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. కేడర్ ఉంటే రాజకీయంగా ఎదురే ఉండదన్నారు. అభివృద్ధిపనులే ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని వివరించారు.నియోజకవర్గాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన కోరగా నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీలు వారి పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యక్రమంలో నిధులు కేటాయించాలని తెలిపారు.ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో 25 ప్రాధాన్యాంశాలను గుర్తించి, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం సూచించారు. "అలా పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తాయని నిత్యం ప్రజల్లో ఉంటూ, కేడర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సీఎం సూచించారు. 2029 ఎన్నికల్లో విజయంపైనే తన ధ్యాస, ఆలోచన ఉన్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముందుగా స్థానికసంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగించి, ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికలకు బలమైన పునాది వేసుకోవాలని నేతలకు సూచించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీకి సమర్థులైన మహిళా నాయకుల్ని గుర్తించాలన్నారు.స్వర్ణాంధ్ర విజన్-2047పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు వాల్యూ అడిషన్ చేయాలన్నారు. విజన్ ప్లాన్ అమలుచేస్తే అభివృద్ధే కాకుండా, ఎన్నికల్లో గెలుపూ సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్రమంత్రులుగా ఒక శాఖను పర్యవేక్షిస్తున్నవారు అదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేయాలని సూచించారు. పార్టీ పదవిలో ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మంత్రి అయినా ఎమ్మెల్యే అయినా పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందేనని తెలిపారు. పార్టీనే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు



**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు.వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు."వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు.ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు.ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునీకరిస్తున్నామని చెప్పారు.దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

## 'అన్నది నా తల్లిని - నీ తల్లిని కాదు'



**మొదటిపేజీ తరువాయి -** అన్నది తన తల్లినని, హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. ఆవేశం తనకు ఉండాలని, బీఆర్ఎస్ నేతలకు కాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.అంతకు ముందు మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేశంతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలు సబిత, సునీతలపై జరిగిన దాడికి ఇంకా చర్యలు తీసుకోలేదని అన్నారు. ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసు పెట్టారని పేర్కొన్నారు. గౌరవ సభ కౌరవసభగా మారిందని మండిపడ్డారు.దీంతో స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ మహిళా సభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం అన్నారు. మీరు చెబితే నేను వినట్లేదా తాను మాట్లాడుతుంటే మీకు ఎందుకంత ఆవేశమని హరీశ్‌రావును స్పీకర్ ప్రశ్నించారు. "మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మిపట్ల తనకు గౌరవం ఉందని స్పీకర్ అన్నారు. వారికి జరిగిన అసౌకర్యానికి నివేదిక కావాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు రాగానే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటామని హరీశ్ రావుకు సమాధానం ఇచ్చారు.మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం. మీరు చెబితే నేను వినట్లేదా. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు. నా మాటలు వినట్లేదు. మీకెలా ఆవేశం ఉంటుంది సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల నాకు గౌరవం ఉంది. నాకున్న 8 మంది అక్కాచెల్లెళ్లలో వారు కూడా నా సోదరీమణులే. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనపై నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం. స్పీకర్‌ను బెదిరించే విధంగా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను పక్కన పెట్టాలంటున్న బీఆర్ఎస్ నేతలు, స్పీకర్ పట్ల బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించాలని హితవు పలికారు.

## తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.



## ర్యూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి నూతన ఈఓ

**వెల్గటూర్ సెప్టెంబర్ 8 ( ప్రజా మంటలు ) :** బీర్పూర్ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా ఐ. కిరణ్ నియమితులయ్యారు. దేవాదాయ శాఖ కమిషనర్ హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు =జ.చీశీ:ూ2/15453/2025, తేదీ 07-09-2026న నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.జగిత్యాల జిల్లా నల్లగొండ దేవాలయం ఈఓగా పనిచేస్తున్న ఐ. కిరణ్.. మంగళవారం ఉదయం బీర్పూర్ ఆలయ ప్రస్తుత ఈఓ వా. శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 08 (ప్రజా మంటలు):** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను నిరసిస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం మెట్టుగూడ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ నేత మంద జగన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజల్లో ఎండగట్టేందుకే ఈ ఆందోళన చేపట్టినట్లు స్పష్టం చేశారు.ఇదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వారసిగూడ సీఐ రాజేందర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది శైలజ, డాక్టర్ హేమ సామల, నేతలు కంది నారాయణ, వనమల భాస్కర్, చింతకింది మల్లేష్, బెజ్జంకి రాజేష్, శైలేందర్, పాక సాయి, మర్పల్లి రవి, శ్రీనివాస్ గౌడ్, ఉండింటి సచిన్, వేణు గోపాల్ రెడ్డి, తుంగ లక్ష్మణ్, అమర్, బాన్సువాడు సాల్వర్, మహేందర్, నక్క మధు, జింకల మల్లేష్, ఎండీ ఖాజా భాయ్, సునీల్, శీలం సాయి యాదవ్, గుమ్మడవెల్లి మధుకర్, యాదగిరి, శివ, ఒంజరి వెంకటేష్, వనమల అనిల్, గంగాపురం ఆంజనేయులు గౌడ్, సుమలత, సుజాత, గీత, మానస, మంజు, రేణుక, ఫరీదా, భాగ్యలక్ష్మి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**( - చుక్క గంగారెడ్డి - సీనియర్ జర్నలిస్ట్ ) సెప్టెంబర్ 08 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లో గల ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళ వారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, గోదాం భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలను ఎన్నికల సంఘానికి పంపిస్తున్నట్లు తెలిపారు.ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై కూడా ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం ఈవీఎం గదులు, వీవీప్యాట్ గదుల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్




**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల) సెప్టెంబర్ 08:** జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం జగిత్యాల జిల్లాలోని అన్ని కోర్టులలో ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జగిత్యాల జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ తెలిపింది.ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, కుటుంబ తగాదాలకు సంబందించిన కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ వెహికల్ చట్టం కు సంబందించిన కేసులు, బ్యాంకు కేసులు, చిట్ ఫండ్ కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించబడునని పేర్కొన్నారు. కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

## కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న హైడ్రా కమీషనర్



**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల జిల్లా ) సెప్టెంబర్ 08:** జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రం అయిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము, కొండగట్టు నందు హైడ్రా కమీషనర్ ఎ.వి. రంగనాథ్ కుటుంబ సమేతంగా మంగళ వారం శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అంజనా రెడ్డి పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎ.వి. రంగనాథ్ ను శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేసి అర్చకులచే ఆశీర్వచనం చేయించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల డి.ఎస్.పి. పురుషోత్తం రెడ్డి, మల్యాల సి.ఐ. రాజు కుమార్, మల్యాల ఎస్.ఐ. సందీప్ కుమార్, కొడిమ్యాల ఎస్.ఐ.నరేష్ కుమార్ ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్ర ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు రంజీవస్వామి, ఆలయ పర్యవేక్షకులు సునీల్ కుమార్, పరిశీలకులు అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.ద

## లోక్ అదాలత్ కి న్యాయవాదులు సహకరించాలి




-సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్

**మెట్టుపల్లి సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** సెప్టెంబర్ నెల 12 వ తేదిన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ కి న్యాయవాదులు సహకరించాలని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ విజ్ఞప్తి చేసారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు పార్టీలకు చెందిన న్యాయవాదులు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా పార్టీల మనసు మారి, రాజీ కుదుర్చుకునే అవకాశాలు పెరుగుతాయాని అన్నారు. కోర్టులో పెండెన్సీ కేసులు తగ్గించడానికి న్యాయవాదుల పాత్ర మరియు సహకారం కీలకం అని అన్నారు. ఈ సమావేశంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్య రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు మెడి చెల్మల సుమలత, జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, ఏలేటి నరేందర్ రెడ్డి, గంద్ర ప్రవీణ్ రావు, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, తోగిటి రాజశేఖర్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, రాంపల్లి జగన్, జేడి సుధాకర్, పసునూరి శ్రీనివాస్, గజ భీంకర్ వెంకటేష్, తులా రాజేందర్, అలాల శంకర్, గోపి, అశోక్, సంజయ్, రజిత ఉన్నారు.

## ఆశ వర్కర్స్ అక్రమ అరెస్ట్ విడుదల

ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కేం సారపు సంధ్య



**ఎల్కతుర్తి ఆగస్టు 8 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్స్ ను అరెస్టు చేయడం జరిగినది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు కింసారపు సంధ్య మాట్లాడుతూ ఆశా వర్కర్స్ ను అరెస్టు చేయడం బాధాకరం. ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వరుని చేస్తాము అని చెప్పుతూ మహిళలను అరెస్టు చేయటం ఏమిటని ప్రశ్నించిన రూ. ఆశా వర్కర్స్ న్యాయమైన డిమాండ్స్. నెలకు 18000 జీతం ఇవ్వాలని అలాగే పిఎఫ్. ఉద్యోగ భద్రత కల్పించాలి. పని ఒత్తిడి తగ్గించి ఆశా వర్కర్స్ కు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరినారు. అరెస్టు అయిన వారిలో కర్రే సరూప జంపాల రాధిక రజిత శైలజ సునంద. సునీత. తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసు ఛేదనలో సహకారం-అభినందించిన జిల్లా ఎస్పీ

**నేరాల నియంత్రణ, ఛేదనలో ప్రజల సహకారం ఎంతో కీలకం**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**( - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల జిల్లా) సెప్టెంబర్ 08:** జగిత్యాల జిల్లా బీర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కిడ్నాప్ కేసును అత్యంత వేగంగా ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లేష్, అలాగే పోలీసులకు విలువైన సహకారం అందించిన వెల్గటూర్ మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన సతీష్, ఏడుకొండలులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళ వారం అభినందించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా వారిని అభినందించి బహుమతులు అందజేశారు.

**గంటల్లోనే కిడ్నాప్ కేసు ఛేదన:**

వివరాల్లోకి వెళితే.. రేకులపల్లి గ్రామానికి చెందిన బర్ల లక్ష్మీనారాయణను హనుమకొండకు చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించలేదనే ఆరోపణతో రెండు కార్లలో వచ్చి కిడ్నాప్ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది.



సమాచారం అందుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిందితుల కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో రాజారాంపల్లి సమీపంలో స్థానికులు సతీష్, ఏడుకొండలు అందించిన సహకారం తో ఒక కారును అడ్డుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో కారులో ఉన్న బాధితుడి ఆచూకీని కూడా పోలీసులు గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాధితుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణతో పాటు నేరాలను వేగంగా ఛేదించడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అన్నారు. గ్రామాల్లో లేదా పరిసర ప్రాంతాల్లో ఏదైనా నేరం జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా సంఘటనలు గమనించినా, నేరానికి సంబంధించిన సమాచారం తెలిసినా ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు సకాలంలో అందించే సమాచారం, సహకారం నేరాల నియంత్రణతో పాటు కేసుల దర్యాప్తులో కూడా కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ కేసులో రాజారాంపల్లి గ్రామస్తులు సతీష్, ఏడుకొండలు అందించిన సహకారం పోలీసుల దర్యాప్తులో ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు పోలీసులతో సమన్వయంతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, కొన్ని గంటల్లోనే కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాత మధు రాజీనామా చేయాలి- కాంగ్రెస్ డిమాండ్



**రెబ్బెన, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.డీసీసీ ఆదేశాల మేరకు రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. స్పీకర్ దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో, ఆయనను కించపరిచేలా వ్యాఖ్యలు చేసి ఉంటే అది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాకుండా దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భావించాల్సి ఉంటుందని అన్నారు.తాత మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తాత మధు వెంటనే ఉపసంహరించుకోవడం కాదు, శాసనసభకు, స్పీకర్‌కు, ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు లింగంపల్లి ప్రభాకర్, దుర్గం రాజేష్, బొంగు నర్సింగరావు, అజ్మేరా గోపి, అజ్మీర ఈశ్వర్, గోగర్ల రాజేష్, గోగర్ల శ్రీనివాస్, శనిగరపు క్రాంతి కుమార్, జాడి కిషోర్, తైదల కృష్ణ, వడ్లూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం**



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ జునూ అమలులో లోపాలను సరిదిద్దాలని, పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు అమలవుతున్న జూాను రద్దు చేసి ఞూాను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తుకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు."పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు" అని స్పష్టం చేసిన నాయకులు, ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మహా ధర్నాకు ప్రతి ఉద్యోగి తరలిరావాలి - జక్కోజు



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాకు ప్రతి ఉద్యోగి భారీగా తరలిరావాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాడుగుల రాములు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.2023 జూలై నుంచి రావాల్సిన పీఆర్‌సీ, ఆరు డీఏల బకాయిలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జూా రద్దు చేసి ఞూా పునరుద్ధరించాలని, బలవంతంగా హెల్త్ కార్డులు కట్టించి జీతాల నుంచి కోత విధించే విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమస్యల పరిష్కారానికి రెండేళ్ల గడువు కోరడం సమస్యలను దాటవేయడమేనని నాయకులు పేర్కొన్నారు.సమావేశంలో ఎండి ఫయాజ్ అలీ, కోహెడ చంద్రమౌళి, సాధు రాజలింగం, కత్రోజు రమేష్, వీరన్న పటేల్, మాదూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ పోటీల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 08 (ప్రజా మంటలు):** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు.డ్రాయింగ్ విభాగంలో రూపశ్రీ ప్రథమ, సానియా తృతీయ బహుమతులు సాధించగా, వ్యాసరచన పోటీల్లో ఎం.నవ్యశ్రీ ద్వితీయ, ఆయుష్ చరస్య తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం ప్రముఖ గాయని విజయలక్ష్మి చేతుల మీదుగా విజేతలు బహుమతులను అందుకున్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సృజనాత్మక పోటీల్లోనూ చురుగ్గా పాల్గొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మహిళా పోలీసులపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రజా ప్రభుత్వంపై చేసిన విమర్శలు, పోలీసులపై దౌర్జన్యానికి నిరసనగా, అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహిళా పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద మరియు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబట్టి, రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. మహిళా పోలీసులను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటని, వెంటనే బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దూదిగామ గంగాధర్ తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, నూతన సర్పంచులు, ఉప సర్పంచ్ లు, మహిళాలు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసీఆర్ నివాసానికి బయలుదేరిన దావ వసంత సురేష్

**జగిత్యాల జిల్లా పోలీసుల అడ్డగింత.. హౌస్ అరెస్ట్**



**జగిత్యాల, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసంపై దాడికి కాంగ్రెస్ నాయకులు వెళ్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో, కేసీఆర్‌ను పరామర్శించేందుకు ఫామ్‌హౌస్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను పోలీసులు అడ్డుకున్నారు.మంగళవారం ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు బయలుదేరిన దావ వసంతను జగిత్యాల పట్టణ సీఐ, పోలీసు సిబ్బంది అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా దావ వసంత సురేష్ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను కేసీఆర్ నివాసానికి ఎస్కార్ట్‌తో పంపిస్తూ, బీఆర్ఎస్ నాయకులను మాత్రం గృహనిర్బంధం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు."తెలంగాణ సాధించినందుకా కేసీఆర్‌కు చావు డప్పులు? పదేళ్లు తెలంగాణకు బంగారు పాలన అందించిన నాయకుడు కేసీఆర్" అని ఆమె వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఇంటి గేటును తాకినా తెలంగాణ ప్రజలు తీవ్రంగా స్పందిస్తారని హెచ్చరించారు.పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని దావ వసంత ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేని పరిస్థితి ఉంటే, రాష్ట్రంలోని సాధారణ మహిళలకు ప్రభుత్వం ఏ రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. చావు డప్పులు కొట్టడం కాకుండా ప్రజలకు మంచి పాలన అందించాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

## అవోపా అధ్యక్షునిగా కట్కూరి సంతోష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**జగిత్యాల, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోప) జగిత్యాల పట్టణ అధ్యక్షుడిగా కట్కూరి సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అధ్యక్ష పదవికి సంతోష్ కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారులు ఆయన ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికల అధికారులుగా పాత సుధాకర్, పిప్పరి శ్రీనివాసమూర్తి, పరిశీలకులుగా కటుకం రాజేష్ కుమార్, కోటగిరి మహేష్ వ్యవహరించారు.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అవోప సంఘ బలోపేతానికి, ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు సంఘ నాయకులు, సభ్యులు ఆయనను అభినందించారు.

## బీడీ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతి**



**జగిత్యాల, సెప్టెంబర్ 8 (ప్రజా మంటలు):** బీడీ కార్మికుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని యూనియన్ నాయకులు మంత్రిని కోరారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కార్మికులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు భూమన్న, ఉపాధ్యక్షురాలు అరుణక్క, సహ కార్యదర్శి అనురాధ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 08:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా తొలి జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, అన్ని వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని వారు డిమాండ్ చేశారు.

## కేటీఆర్‌పై దాడికి కాంగ్రెస్ కుట్ర పన్నింది

**- మన్నె క్రిశాంక్ ధ్వజం**




**సికింద్రాబాద్,సెప్టెంబర్ 08 (ప్రజామంటలు) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించేందుకు ఎర్రవెల్లి నివాసానికి వెళు న్న బీఆర్ఎస్ శ్రేణులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడికక్కడే అక్రమంగా అరెస్టు చేయించిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. మంగళవారం ఆయన కార్ఖానా పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ...పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను సైతం పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఓ పక్కా వ్యూహం ప్రకారమే హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు కేటీఆర్‌ను తరలించారని క్రిశాంక్ ఆరోపించారు. కేటీఆర్‌పై దాడి చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి ఆదేశాలు ఇచ్చారని, దాడికి యత్నించిన వారిలో స్థానిక ఎమ్మెల్యే అనుచరులు కూడా ఉన్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయితే అక్కడకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను, గూండాలను బీఆర్ఎస్ కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టడంతో తోకముడిచి పారిపోయారని ఆయన పేర్కొన్నారు.

# జలవివాద పరిష్కార కమిటీ భేటీ గోదావరిపై 2023 నాటి లెక్కలు సరిగాలేవని ఏపీ వాదన

**దిల్లీలో తెలుగు రాష్ట్రాల జలవివాద పరిష్కార కమిటీ భేటీ**

**సమావేశంలో పాల్గొన్న ఏపీ, తెలంగాణ అధికారులు**

**2014 జూన్ 2న ఉన్న నీటిని శాస్త్రీయంగా గణించాలన్న ఏపీ**

**తెలుగు రాష్ట్రాల జలవివాదం**




గోదావరిపై కొత్త ట్రిబ్యునల్ వేసి తెలుగు రాష్ట్రాల నీటి వాటాలు తేల్చాలని ఏపీ డిమాండ్ చేసింది. రెండు రాష్ట్రాల జల వివాదాలపై ఏర్పాటు చేసిన కమిటీ దిల్లీలో సోమవారం సీడబ్ల్యూసీ ఎదుట తన వాదనలు వినిపించింది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన నాటికి అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా గణించాలని ఆ మేరకు రెండు రాష్ట్రాలకు పంచాలని ఆ తర్వాతే తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని ఏపీ కోరింది. అలాకాకుండా ముందే ఆ ప్రాజెక్టులకు అనుమతులెలా ఇస్తారని ప్రశ్నించింది. సాంకేతిక సలహా కమిటీ, కేంద్ర జలసంఘం తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడంలో మార్గదర్శకాలు పాటించడం లేదని ఆక్షేపించింది. చర్చలు: దిల్లీలో సోమవారం రెండు తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై ఏర్పాటు చేసిన కమిటీ సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ ప్రసాద్ అధ్యక్షతన సమావేశమైంది. ఏపీ నుంచి జలవనరులశాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ అక్కిరాజు రాధాకృష్ణ హాజరయ్యారు. తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేశ్‌బాబు, అంతర్రాష్ట్ర విభాగం సీఈ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ భేటీలో చాలా అంశాలపై చర్చలు, వాదోపవాదాలు సాగాయి. గోదావరిలో నీటి లభ్యతపై 2023లో సీడబ్ల్యూసీ రూపొందించిన లెక్కలను ఇప్పటికే తిరస్కరించామన్న ఏపీ సీడబ్ల్యూసీ నివేదిక స్వతంత్ర అధ్యయనంలా కాకుండా, పాత నివేదికల్లోని పొంతన లేని భాగాలను ఒకచోట చేర్చినట్లుగా ఉందని ఆక్షేపించింది. పోలవరానికి అనుమతులిచ్చినప్పుడు వ్యాప్కోస్ అధ్యయనాన్ని తప్పుపట్టారని మళ్లీ అవే లెక్కలను 2023లో తీసుకున్నారని వాదించింది. 2023 లెక్కల్లో తేడాలేమీ లేవని సీడబ్ల్యూసీ సీఈ స్పష్టం చేయగా లెక్కల్లో ఎక్కడెక్కడ తేడాలున్నాయో సీడబ్ల్యూసీ, సాంకేతిక సలహా కమిటీకి ఇప్పటికే వివరించామని ఏపీ అధికారులు వాదించారు. ఒక్కో పరీవాహకానికి ఒక్కో రకమైన లెక్కలు తీసుకున్నారని కాళేశ్వరం అనుమతులకు ఒక లెక్కలు తీసుకుంటే సీతమ్మసాగర్‌కు ఇంద్రావతి ప్రవాహాన్ని పరిగణించారని ఏపీ వాదించింది. ఒక్కో ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ ఒక్కో ప్రొసీజర్‌ను అనుసరించిందని వాస్తవ లెక్కల ఆధారంగానే తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులను పరిశీలించాలని గోదావరిపై కొత్త ట్రిబ్యునల్ వేసి రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి వాటాలు తేల్చాలని కోరింది. 2023 గోదావరి జలాల లభ్యత లెక్కలను రెండు రాష్ట్రాలకూ పంపించి, వారి అభిప్రాయాలను సీడబ్ల్యూసీ అధికారులు తెలుసుకోవాలన్న సీడబ్ల్యూసీ ఛైర్మన్ తప్పులుంటే సరిదిద్దుకోవాలన్నారు. 2014కు ముందే ఈ ప్రాజెక్టులు చేపట్టామని గోదావరి నీటి లెక్కలను మళ్లీ తిరగదోడాల్సిన అవసరం లేదని తెలంగాణ వాదించింది. తెలంగాణ వాదనలపై అభ?యంతరం: రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులిచ్చిన తీరు సరిగా లేదని ప్రాజెక్టుల ప్రతిపాదనలు తొలుత గోదావరి బోర్డుకు, తర్వాత సీడబ్ల్యూసీకి పంపించి, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు తీసుకోవాలని ఏపీ కోరింది. రాష్ట్రాల మధ్య నీటి వాటాలు తేల్చకుండా ప్రాజెక్టులను ఎలా క్లియర్ చేస్తారని ప్రశ్నించింది. ఈ సమయంలో జోక్యం చేసుకున్న తెలంగాణ అధికారులు 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలోనే ఆ ప్రాజెక్టులు చేపట్టినట్లు వాదించారు. వాటిని కొత్తగా చేపట్టలేదని రీఇంజినీరింగ్ చేశామని స్పష్టం చేశారు. తెలంగాణ వాదనలపై అభ యంతరం తెలిపిన ఏపీ అధికారులు 10 టీఎంసీల ప్రాజెక్టును 100 టీఎంసీలకు పెంచితే రీఇంజినీరింగ్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రాజెక్టుల స్వరూపమే మారినందున కొత్తవాటిగానే చూడాలని వాదించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి ప్రవాహం లేకున్నా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్‌కు నీటిని వదిలేస్తోందని ఏపీ ఫిర్యాదు చేసింది. కృష్ణా బోర్డులో చర్చించిన ప్రకారం విద్యుత్ ఉత్పత్తి ఆపేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదంది. పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ అధికంగా నీటిని మళ్లిస్తోం దని తెలంగాణ వాదించింది. కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణ వాడుకోవచ్చని తమ వాటానే తీసుకుంటున్నామని ఏపీ స్పష్టం చేసింది. చెన్నైకి నీరు చేరేలా ప్రవాహాన్ని మెయింటెన్ చేస్తున్నామంది. ఈ సమయంలో జోక్యం చేసుకున్న సీడబ్ల్యూసీ ఛైర్మన్ ఈ వివాదాన్ని కృష్ణా బోర్డు ఛైర్మన్ పరిష్కరించాలని సూచించారు. 1,000 టీఎంసీల నీరు సముద్రంలోకి : ఈ ఏడాది ఎల్‌నినోతో కరవు ఉన్నా, గోదావరి ద్వారా 1,000 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని, ఈ పరిస్థితుల్లో పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చేందుకు ఇబ్బందేంటని ఏపీ అధికారులు ప్రశ్నించారు. తెలంగాణ సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్ కలగజేసుకుని 2014కు ముందే ప్రతిపాదనల్లో ఉండి, తాము చేపట్టిన ప్రాజెక్టులన్నింటికీ ఏపీ అంగీకరిస్తే 2014 తర్వాత ఏపీ చేపట్టిన ప్రాజెక్టులన్నింటికీ తాము అంగీకరిస్తామని చెప్పారు. దీనిపై సమావేశంలో ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ నెలాఖరుకు మరోసారి భేటీ అవుదామని తెలుగు రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ ఛైర్మన్ సూచించారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు**

**న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తాతా మధు అరెస్ట్**

**కోకాపేట్‌లో నవీన్ రెడ్డి అరెస్ట్**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీల నివాసాలకు వెళ్లిన పోలీసులు వారికి నోటీసులు ఇచ్చి అదుపులోకి తీసుకున్నారు. కాసేపట్లో కోర్టులో హాజరు తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆయనను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కాసేపట్లో ఎమ్మెల్సీ తాతా మధును కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం నవీన్ కుమార్ రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. శాసనసభ స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఫిర్యాదు మేరకు సెక్షన్లు 352 రెడ్ విత్ 3(5), ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కేసు నమోదైంది. ప్రశ్నించే గొంతుకలను అణచివేసేందుకే అక్రమ అరెస్టులు మాయమాటలు చెప్పి ప్రజలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై శాసనసభ, శాసనమండలిలో ప్రశ్నించాలని భావిస్తే తమను సభలోకి ప్రవేశించకుండా అక్రమంగా అడ్డుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి, హామీల అమలుపై నిలదీస్తామనే భయంతోనే తమపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న తమను అక్రమంగా అరెస్టులు చేయడం ద్వారా గొంతు నొక్కాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇలాంటి అరెస్టులు, బెదిరింపులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజల తరఫున నిరంతరం పోరాడతామని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు వెనక్కి తగ్గేది లేదని నవీన్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ ఎమ్మెల్సీల అరెస్ట్‌పై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా అరెస్టు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు అవుతాయంటే ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా అరెస్ట్ అవుతామన్నారు. సబిత, సునీతకు జరిగిన అవమానాలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌ను గమనిస్తున్నా రన్నారు. న్యాయస్థానాలను ధిక్కరించడమే శాసన సభ్యులను, మండలి సభ్యులను సభలోకి రానివ్వకుండా రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్రూరంగా, కర్కశంగా వ్యవహరించిన పోలీసులే నేడు ఉల్టా చోర్



కొత్వాల్ కో డాంటే అన్నట్లు తాతా మధు, నవీన్ రెడ్డిలను అరెస్ట్ చేయడం దురదృష్టకరమని హరీశ్‌రావు విమర్శించారు. హైకోర్టు చెప్పినా లెక్కచేయకుండా కేసులు పెట్టి అరెస్ట్ చేయడం అంటే చట్టాన్ని, న్యాయస్థానాలను ధిక్కరించడమేనన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కూడిన టీషర్ట్‌లు ధరించి అసెంబ్లీ గేటు లోపలికి వెళ్లడానికి యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు ఆగ్రహంతో రెచ్చిపోయి స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మరో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కూడా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆ ఇద్దరిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి నివాసాలకు వెళ్లి పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు వారి నివాసాలకు చేరుకున్నారు.

# భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు ముందడుగు ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ బృందం

**భద్రాద్రి జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం పర్యటన**

**సుజాత్‌నగర్, సీతంపేట, దుమ్ముగూడెం, చాపరాలపల్లెలో పర్యటన**

**పాల్వంచ, దమ్మపేట, పెనుగడప ప్రాంతాలను పరిశీలించిన ఏఏఐ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలాలను ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం చేసింది. రేపు కూడా ఈ బృందం జిల్లాలో పర్యటిస్తుంది. భద్రాద్రి జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుంది. సుజాతనగర్ మండలంలోని సీతంపేటలో బృందం పర్యటించి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, విమానాల రాకపోకలకు అవసరమైన అంశాలను అధ్యయనం చేసింది. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా గుర్తింపు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతనగర్ మండలంలోని సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే, సాంకేతిక అంశాలను పరిశీలిస్తారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా అధికారులు బృందం వారి వెంట ఉన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 10 నుంచి 15 కిలోమీటర్ల మేర గుట్టలు అడ్డుగా ఉండకూడదు. నేల గట్టిగా ఉండాలి. మొదటగా స్థలాన్ని పరిశీలించాలి. ఇక్కడ మూడు సైట్‌లను చూయిస్తున్నాం. రేపు భద్రాచలంలో మరో సైట్‌ను చూయిస్తాం. వీటిపై అధికారులు మళ్లీ స్టడీ చేస్తారు రఘురామి రెడ్డి, ఖమ్మం ఎంపీవిమానాశ్రయం నిర్మాణానికి అనువైన ప్రాంతాల పరిశీలన : భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్తు విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేసింది. జిల్లాలో విమానాశ్రయాుం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఎంపీ రఘురామి రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో అన్ని అంశాలను బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుందని చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ అధ్యయనం చేసి విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తారు.

# విచారణకు హాజరుకాని సీనియర్ ఐఏఎస్‌లపై హైకోర్టు సీరియస్

**భూసేకరణ పరిహారానికి సంబంధించి ఆర్థికశాఖ, రోడ్లు, భవనాల ముఖ్యకార్యదర్శులపై కోర్టు ధిక్కరణ పిటిషన్లు**

**దేశాల ఉల్లంఘనపై విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశాలు**

**గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం**




కోర్టు ధిక్కరణ పిటిషన్లలో బెయిలబుల్ వారెంట్ జారీ అయినప్పటికీ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ విచారణకు గైర్హాజరు కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో నోటీసులు జారీ అయ్యాక విదేశాలకు ఎలా వెళతారని విమానాశ్రయంలో అరెస్ట్ చేస్తే పరిస్థితి ఏమిటని నిలదీసింది. ఉన్నతస్థానంలో ఉన్న అధికారులకు కోర్టు ధిక్కరణ పిటిషన్లలోని సాధారణ నిబంధనలు కూడా తెలియవా అంటూ నిలదీసింది. మరోసారి ఇలాంటివి పునరావృతమైతే ఉపేక్షించబోమని హెచ్చరించింది. కోర్టులో హాజరు కావాలని ఆదేశాలు భూసేకరణ పరిహారానికి సంబంధించి కింది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన మేరకు సదరు అధికారులపై కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయి. భూసేకరణ పరిహారంలో భాగంగా నిర్ణయించిన మొత్తంలో 50 శాతాన్ని 3 నెలల్లో డిపాజిట్ చేయాలంటూ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన నాగిరెడ్డితో పాటు మరొకరు సంబంధిత అధికారులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ధిక్కరణ కింద సదరు అధికారులను న్యాయస్థానంలో హాజరు కావాలని ఆదేశించింది. అయినప్పటికీ అధికారులు గైర్హాజరు కావడంతో, ఆయా అధికారులపై గత వారం బెయిలబుల్ వారెంట్స్ జారీ అయ్యాయి. ఇక ఉదాసీనంగా ఉండబోం ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించలేదని, ధర్మాసనం ఆదేశాలను అమలు చేశామని అధికారులు వారెంట్ రీకాల్ చేశారు. హాజరు మినహాయింపు కోరుతూ పిటిషన్లు దాఖలు చేశామని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అసెంబ్లీ సమావేశాలుండటంతో కోర్టుకు హాజరుకాలేకపోయారనగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేశాక అధికారులు హాజరు కావడానికి ఎందుకు సిగ్గుపడుతున్నారని, కనీసం ఆన్లైన్లో కూడా హాజరు కావడంలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కోర్టు కూడా ఇక ఉదాసీనంగా ఉండబోదని, గైర్హాజరు పిటిషన్లను అనుమతించబోమని, అలా చేస్తే వారు సాధారణ అంశంగా పరిగణించే అవకాశముందని వ్యాఖ్యానించారు. మరోసారి పునరావృత్తం కాకూడదు భూసేకరణకు సంబంధించిన పరిహారంలో నిర్వాసితులపై 50 శాతం డిపాజిట్ చేయాలని ఆదేశాలు ఇచ్చి 12 వాయిదాలు తీసుకున్నా ఎందుకు చెల్లించరని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రజలకు చివరి అవకాశం న్యాయస్థానం ఒక్కటేనని, భూములు తీసుకున్నాక కనీసం 50 శాతం కూడా చెల్లించకపోతే ఎలా అని నిలదీశారు. ఉత్తర్వులు అమలైనప్పటికీ కోర్టు ధిక్కరణ ముగిసిపోదని గుర్తించాలంటూ హెచ్చరించారు. ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులే ఇలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. మరోసారి ఇది పునరావృతం కాకూడదని హెచ్చరించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేశామని, కోర్టు ధిక్కరణ విచారణలో క్షమాపణ కోరుతూ ఇద్దరు అధికారులు అఫిడవిట్లు దాఖలు చేయడంతో విచారణను మూసివేశారు.

# ఏపీ రెయిన్ అలర్ట్ పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం

**గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ**

**మరో 3 గంటల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**

**పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల సంస్థ**



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో మూడు గంటల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేట వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గంటకు 50 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. ప్రజలు, రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని చెట్లు, కరెంట్ స్తంభాల కింద నిలబడవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఈ క్రమంలోనే పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కారు మబ్బులు కమ్ముకొని వాన దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వాన నీరు చేరడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. బాపట్ల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జాతీయ రహదారి వెంట వీ కన్వెన్షన్ సమీపంలోని సూచిక బోర్డు నెలకొరిగి కొంతదూరం వెళ్లిపోవడంతో పాటు స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ చిత్రాన్ని చూసి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా జాతీయ రహదారులపై ఏర్పాటు చేసే బోర్డులు బలంగా ఉంటాయి. కానీ ఈదురుగాలులకు ఇది పడిపోవటంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బోర్డు నెలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే దీనిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీవారి భక్తులకు సరికొత్త అనుభూతి.. ప్రారంభానికి సిద్ధమైన వరల్డ్ క్లాస్ ఎస్వీ మ్యూజియం

**సీఎం చేతుల మీదుగా ఎస్వీ మ్యూజియం ప్రారంభానికి ఏర్పాట్లు**

**పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు టీటీడీ ఆదేశాలు**

**బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మెరుగైన మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై సమీక్ష**

**గరుడసేవ నాడు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**

**ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు**



తిరుమలలో భక్తులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఎస్వీ మ్యూజియం ప్రారం భోత్సవానికి ముహూర్తం ఖరారైంది. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ మ్యూజియాన్ని ప్రారంభించేందుకు టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈ మ్యూజియం పనులను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యూజియంలోని అన్ని విభాగాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. మ్యూజియం నిర్వహణకు సంబంధించి టీసీఎస్ బృందానికి కూడా అవసరమైన సూచనలు అందించాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకయ్య చౌదరి దిశానిర్దేశం చేశారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు.. సిగ్నల్ వ్యవస్థపై టీటీడీ ప్రత్యేక దృష్టి మరోవైపు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై కూడా అదనపు ఈవో సమీక్షించారు. ముఖ్యంగా తిరుమల, ఘాట్ రోడ్లు, కాలిబాట మార్గాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేకించి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే గరుడసేవ రోజున మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సెల్ టవర్ల పనితీరును సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచి, ఎలాంటి అంతరాయం లేకుండా కమ్యూనికేషన్ సేవలు అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల నాటికి తిరుమల, తిరుపతి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుండగా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

# నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి

**దసరా మరుసటి రోజే కొత్త పార్టీ ప్రకటిస్తానన్న మాజీ ఎంపీ**

**టీడీపీ, వైసీపీ కుటుంబ పార్టీలంటూ విజయసాయిరెడ్డి విమర్శ**

**నమ్మకద్రోహి అంటే నిజాలు బయటపెడతానంటూ వైసీపీకి హెచ్చరిక**

**బొత్స, సత్యకుమార్ ఆరోపణలను తిప్పికొట్టిన సాయిరెడ్డి**



మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు. తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు. తన కొత్త పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తాను ఉండబోనని, సమర్థులైన వ్యక్తినే ఆ స్థానంలో నిలబెడతామని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆసక్తితో 'రెడ్డి' సామాజిక వర్గం ఆవిర్భావం, రెడ్డి రాజుల పాలనపై 350 పేజీల పుస్తకం రాసినట్లు ఆయన వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com